# నేటినిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 3-10-2024


## టపటప చినుకులు

టపటప చినుకులు రాలాయి
పట పట వానలు కురిశాయి
వాగులు వంకలు నిండాయి
మట్టికి మహిమలు వచ్చాయి
పక్షులు కిలకిల నవ్వాయి
గొడ్డూ గోదా అరిచాయి
పిల్లలు వానలో తడిశారు
కాగితం పడవలు వేశారు
వరదకు కట్టలు కట్టారు
నీటిని చిమ్ముతు ఎగిరారు
అమ్మలు వాళ్లను చూశారు
వానలో ఎగరొద్దన్నారు
వినని బాలల్ని తిట్టారు
అలిగి మంచం ఎక్కారు.



-ఎర్రోజు వెంకటేశ్వర్లు,
9492557037

## బ్రతుకు పరమార్థం?

నిదురించడం లేకుంటే
నిశిరాత్రికి అర్థమేమిటి ?
ఎదరు చూడడం లేకుంటే
ఉదయానికి అందమేది?
పాటుపడటం తెలియకుంటే
పగలు తో పనియేమిటి?
అన్నం రుచించక పోతే
ఆకలికి గుర్తేమిటి?
ఇష్టపడటం తెలియక పోతే
హృదయానికి ఉనికి యేది?
గమ్యం నిర్ణయం కాకుంటే
దిశా నిర్దేశం దేనికి?
కడుపులో నెనరు లేకపోతే
కన్నీటికి విలువ యేమిటి?
ఆనందం పొందకపోతే
అసలు బ్రతుకు పరమార్థం ఏమిటి?

-డా.గంధ్ర లక్ష్మణరావు
9849328036






తెరువము
పరువము
మురిపించి లాలించిన క్షణాలను
ఎలా మరువము?
-డబ్బీరు ప్రభాకర్
రాయపూర్.

పువ్వులు
నవ్వులు
హరివిల్లులై కలుపును -విరిసినపుడే
అవి దవ్వులు.
-జూలూరి శైలజ
హైదరాబాద్.

ఇంట
పంట
భయాన్ని తరిమేస్తే విజయం వస్తుంది
వెంట
-సింగీతం విజయలక్ష్మి
చెన్నై

సంయోగం
వియోగం
జీవనపయనం రెండింటి మధ్యన
గొప్ప ప్రయోగం
-పి.శ్రీదేవి.
హైద్రాబాద్.

ధర్మము
మర్మము
మానవతా విలువలు లేనివాడు
అనుభవిస్తాడు ఖర్మము.
-సింహాద్రి వాణి
విజయవాడ.

ఆయాసం
అనాయాసం
మనకు మనమే నియంత్రించుకోవాలి
ఆటుపోట్ల ప్రయాసం!
-పట్నాయకుని రామకృష్ణారావు.
కంచరపాలెం.విశాఖపట్నం.

ముంచుతుంది
తుంచుతుంది
మంచివారి మౌనం దుష్టుల
కిరాతకాలను పెంచుతుంది
-కృష్ణ తేజ
హైదరాబాద్

అప్పుడూ
ఇప్పుడూ
నామరూపాలు ఏవయినా దైవం
ఒక్కడే ఎప్పుడూ !
-డాక్టర్ శైలజ మామిడాల
హనుమకొండ

కలిసి
మెలిసి
యువతా తప్పటడుగు వేస్తావు
ఎందుకు తెలిసితెలిసి
-సంధ్య జంగాల
కంకిపాడు

అపార్థం
అనర్థం
అపోహ దురూహలు ఎన్నడూ కావు
సమర్థం.
-పట్నాల ఈశ్వరరావు
విజయనగరం

మానం
అనుమానం
ఈకాలం ఆడపిల్లలకు జరగకుండా
చూడాలి అవమానం.
-డాక్టర్. షహనాజ్ బతుల్
హైదరాబాద్

బలవంతుడు
ధనవంతుడు
సాటివారితో సఖ్యతగా మనగలిగిన
వాడే గుణవంతుడు
-ద్విభాష్యం నాగలక్ష్మి
అనకాపల్లి

చాటు!
మాటు!!
దుర్బుద్ధితో ఎవరికీ తెరచాటున
చేయకు చేటు!!!
-మన్నవ సుధాకర్
కృష్ణలంక విజయవాడ

కావ్యము
శ్రావ్యము
నేటితరం వీటికి ప్రాధాన్యము ఇవ్వడం
భావ్యము
-గిడుగు లక్ష్మీ దత్
న్యూజెర్సీ ,అమెరికా

గిలిగింతలు
పులకరింతలు
పెనిమిటి రాక,ఆలస్యానికి నిద్రలో
పలవరింతలు!
-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
మహబూబ్ నగర్.

వాడుకుంటారు
వేడుకుంటారు
అవసరం తీరాక మనుషులు
జీవితాలతో ఆడుకుంటారు....!!
-జి.కె.నారాయణ(లక్ష్మి శ్రీ )
జోగులాంబ గద్వాల్ జిల్లా

వరుడు
సురుడు
పాణిగ్రహణం తరువాత
అలకపాన్పుపై కోరికల అసురుడు.
-వి యస్ శాస్త్రి ఆకెళ్ల
విజయనగరం.

ఆగిపోను
ఓడిపోను
జీవనసమరంలో ముందుకే గానీ
వెనుకకు మరలిపోను!
-బత్తిన గీతాకుమారి

పరువము
అరువము
వయసులో చేసిన చిలిపి
పనులు మరువము
(అరువము = ఆశ, కాంక్ష)
-YLNV ప్రసాద్ రావు,
విజయనగరం.

యమకం
గమకం
ప్రేమలో తేలిన యువకుడి కళ్ళల్లో
తమకం!
-ఎన్. ఆర్.తపస్వి
చెన్నై

రావాలి
కావాలి
నవతరం ముందుకు వచ్చి నవ్యత
తేవాలి.
-సూర్యకళ తనికెళ్ల
విశాఖపట్నం.

నయనం
పయనం
అన్యాయాన్ని ఎదురించు.. చూసి
చిత్తగించకు పలాయనం!
-జీ యన్ వీ సత్యనారాయణ
హైదరాబాద్

చీటికి
మాటికి
పోవాలి అనుకుంటాడు పిరికివాడే
నైరాశ్యంతో కాటికి.
-బెహరా నాగభూషణరావు
గజపతినగరం

జ్ఞానం
మౌనం
తన ఉనికి తనకు లేకుంటే ధ్యానం.
-కె. ఎమ్. కె. మూర్తి
సికింద్రాబాద్

పారం
సారం
బ్రతుకే లావాదేవీల వ్యాపారం.
విశ్వాభిరుచుల కాసారం.
-డా.రామడుగు వేంకటేశ్వర శర్మ.
హైదరాబాదు.

రాజసము
తామసము
హీనమైన గుణాలను వీడిన జీవనం
సంతసము
-ఇలపావులూరి రాజ్యలక్ష్మి
హైదరాబాద్

విత్తనం!
పెత్తనం!
ఇతరుల ఉన్నతిని చూసి
భరించలేకపోవడం ఉడుకుమోత్తనం!
-సిహెచ్. వి. బృందావన రావు
నెల్లూరు

సహకారం
ఉపకారం
చేసిన మేలు మరచి ప్రవర్తించటం
అహంకారం!
-గోపరాజు వెంకట
సూర్యనారాయణ
హైదరాబాద్.

ఇష్టం
కష్టం
మనసు భాగస్వామిగా ఉంటే
దరిచేరదు నష్టం
-విత్తనాల విజయ కుమార్
హైదరాబాద్

పతి
సతి
కాపురం నిలవాలంటే కలవాల్సింది
ఇరువురి గతి
-సాధన.తేరాల,
ఖమ్మం.

కళకళ
తళతళ
కుటుంబాలలో అనుబంధాలు
కరువై వెనుకటితరం విలవిల
-హైమ. కందుకూరి
హైదరాబాద

విచ్చుకోవాలి
మెచ్చుకోవాలి
చక్కగా..మాట్లాడాలంటే ముందు
వినడం నేర్చుకోవాలి
-రాయవరపు సరస్వతి
చోడవరం,అనకాపల్లి జిల్లా

యోచన
సూచన
చెడు ఆలోచనలను కోరికలను
నియంత్రించుకోవడమే వివేచన
-కపిలవాయి అశోక్ బాబు
నాగర్ కర్నూల్

కోపం
తాపం
నిగ్రహించు.లేకుంటే జీవితానికి
అదే శాపం.
-పూడిపెద్ది వెంకట సుధారమణ
విశాఖపట్నం

సొదలు
రొదలు
చెప్పుడు మాటలు నమ్మితే
బ్రతుకులో వ్యధలు!
-దినవహి సత్యవతి
గుంటూరు

పుస్తక సమీక్ష

# తాళ్ళపల్లి రసరమ్య గేయ మౌక్తికాలు

తాళ్లపల్లి మురళీధర గౌడు నాకు చిరకాల మిత్రుడు. మా సాహిత్య బంధం అయిదు దశాబ్దాలకు పైమాటే. 1960-70 దశకంలో ఆనాటి 'విశ్వ రచన', 'చుక్కాని', 'నేత' వంటి సాహిత్య పత్రికలల్లో విరివిగా కవితలు రాసే వాళ్ళం. తదనంతర కాలంలో అగ్ర శ్రేణి కవులుగా పేరు గాంచిన ప్రముఖులెందరో ఆ వేదికల నుండి వచ్చిన వారే.

**"చిన్ననాటి పత్రికల్లో**
**వెతుకు**
**నేటి కవుల పునాదులు**
**అక్కడే సుమా!"** అని రాసుకున్నాను నేనో 'నానీ'లో.

మురళీధరుడు విద్యార్థిగా వున్న రోజుల్లోనే ఓ లిఖిత పత్రిక నిర్వహించినట్టు గుర్తు. **'యువభారతి'** సంస్థలో క్రియాశీలక కార్యకర్తగా బిజీగా వుండేవాడు. వానమామలై వరదాచార్య మరియు డా॥ తిరునగరి శ్రీనివాసాచార్య గారల ప్రత్యక్ష శిష్యుడు. సాహిత్యం అబ్బటానికి ఆ మహనీయుల ఆత్మీయ స్పర్శ కూడా ఒక ప్రధాన కారణం కావొచ్చు. **'వెలుగు రేఖలు', 'ప్రశ్నార్థకాలు'** పేరిట రెండు కవితా సంపుటాలు వెలువరించాడు. ప్రశ్నార్థకాలు ఆంగ్లం మరియు హిందీ భాష ల్లోకి కూడా అనువదించబడ్డాయి. **'ఐసాక్యోఁ'** అనే హిందీ పొత్తాన్ని **'ఇలా ఎందుకు?'** పేరిట తెలుగులోకి అనువాదం చేసి అనువాదకుడిగా కూడా తన ప్రతిభను నిరూపించుకున్నాడు. సరుకు రవాణా సంస్థలో (టిసిఐ) సుదీర్ఘ కాలం ఉద్యోగ ప్రస్థానం గావించాడు. ఉద్యోగ రీత్యా కొంత కాలం న్యూఢిల్లీలో కూడా వున్నాడు. అక్కడా తెలుగు సంస్థలతో సబంధాలు పెట్టు కుని తన సాహితీ వ్యాసంగం కొనసాగించాడు. ప్రముఖ తెలుగు సాహితీ వేత్తలను ఢిల్లీకి ఆహ్వానించి వారితో ఇంటర్వ్యూలు నిర్వహించాడు. ఈ పరిచయ వ్యాసాలన్నింటినీ **'జీవన రేఖలు'** శీర్షికన ఓ సంకలనం వెలువరించాడు. 2001 సం॥లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి, పుస్తక ప్రచురణ రంగంలో ప్రవేశించి, గత పదిహేనేళ్లుగా ఆరు వందలకు పైగా గ్రంథాల ప్రచురణ బాధ్యతలు నిర్వహించి **'పుస్తక శిల్పి'**గా ప్రసిద్ధికెక్కాడు. యింకా ఆ వ్యాపకం లోనే కొనసాగుతున్నాడు.

సుదీర్ఘ విరామం తర్వాత తాజాగా యాభయి కవితల **'గేయ మౌక్తికాలు'** సంపుటితో మన ముందుకొచ్చాడు మురళీధరుడు.






ప్రతులకు:
తాళ్లపల్లి
మురళీధర్ గౌడ్,37/202,
రాంమోహన్ టవర్స్,
హెచ్‌యుడిఏ కాంప్లెక్స్,
సరూర్‌నగర్, హైదరాబాద్-035
సెల్: 939176552

**'మౌక్తికం'** అంటే ముత్యం. తన అక్షర ముత్యాలతో గేయ మాలికనల్లి సాహితీ ప్రియులకు అందిస్తున్నాడు.

**'కలం చేత బూనినాను**
**కమ్మని కవితల నొసగుము**
**నా లోపలి భావాలకు**
**నవ్యాకృతి నొసగుమమ్మ**
**వాణీ! విద్యలరాణీ'** అంటూ శారదాదేవి ముంగిట ప్రణమిల్లుతు మన వేలు పట్టుకుని గేయ కావ్యంలోకి నడుపించుకుని వెళ్తాడు.

**"మాతృదేవతను మించిన**
**దైవము మరియొకటి లేదు**
**సత్యమును మించినట్టి**
**ధర్మము వేరొకటి లేదు"** ఇదీ మురళీధరుడు నమ్మిన సిద్ధాంతం.. ఫిలాసఫీ.

1967 సం॥లో తాను రాసిన తొలి గేయా కవితను పొందుపరచడం విశేషం.

**"భారతీయులను నాడు**
**బాధించిరి తెల్లవారు**
**నల్లవారె మననిప్పుడు**
**నలిపి వేయుచున్నారు**
**పైకి చెప్పెదరు బీదల**
**పాలిటి ఆత్మీయులమని**
**ఆ బీదలకే శత్రువు**
**లగుటె కాదె విడ్డూరం!"**

కవి నిశిత దృష్టిని పట్టి యిచ్చిన పంక్తులు. సమాజంలో నేటికీ మారని దుస్థితి యిది. చిన్నప్పుడే తల్లిదండ్రులను పోగొట్టుకున్న దురదృష్టవంతుడు తాళ్లపల్లి.

**'అమ్మ పెదవులపైకి నగవును**
**చూచు భాగ్యము లేదు నాకు**
**అమ్మ వదనమ్ముందుగల, దర**
**హాస రేఖలు కరువె నిరతము"** ఎవరు ఓదార్చుగలరు? కవిత్వం తప్ప.

మురళీధరుడు గొప్ప మానవతా వాది.
**"దొంగలు కాదోయి మీరు/ దగా పడిన సోదరులు**
**సంఘంచే తరమబడిన/ సహజీవు లు మానవులు"** అంటు సంబోధిస్తాడు మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వానికి లొంగి పోయిన బందిపోట్లను ఉద్దేశించి..

**"మంచి కొరకు పోరాడే**
**మహా త్యాగ వీరులార!**
**మీ గుండెల రక్తంతో**
**మాతృభూమి తరించింది"** అంటు వీర జవానులను స్మరించుకుం టాడు.

**"ఎవ్వతెవు నీవు? నా**
**రస జగద్రాజ్ఞివా!**
**హృదయ వీణియ తంత్రు**
**లను మీటు గాయనివా!**
**ఎటునుండి వచ్చితివి**
**ఎక్కడకు పోదువో!**
**కాసేపు యిట ఆగి**
**విశ్రమింతువు చెలియ!"** అంటు భావోద్వేగంతో పరవసిస్తాడు. మరో చిక్కటి ప్రణయగేయం **"స్వప్నరేఖ".**

**"చల్లని మీ దీవెనచే/ ఉల్లములే పల్లవించు**
**స్వాతిజల్లుకన్న మీదు/ చిత్తము ఎంతో స్వచ్ఛము"** అంటు వానమలై వారిపట్ల తన గురుభక్తిని చాటుకుం టాడు.

**"అతని కావ్య జలపాతం**
**రసగంగా సంజాతం**
**నవ కవితా క్షీరాంబుధి**
**నారాయణ సుకళానిధి"** అంటు మహాకవి సినారెను కీర్తిస్తాడు. గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి మహనీయులపై ముక్తకాలతో గేయాలను అల్లి తన భక్తి ప్రవత్తులను వ్యక్తపరుస్తాడు మురళీధరుడు.

**"మనుజునిగా జన్మించితి**
**మనిషిగానే జీవింతును**
**జీవితమ్ము చరితార్థము**
**చేయనె కృషిగావింతును**
**ఆత్మయనెడు కావ్యంలో**
**నన్ను గూర్చి వ్రాసుకొందు"** అంటు తనను తాను ఆవిష్కరించుకుంటున్న తాళ్ళపల్లి మురళీధరగౌడు అందుకున్న సత్కారాలు, పురస్కారాలు తక్కువేం కాదు. అందులో తన సాహితీ స్వర్ణోత్సవ సత్కార సభలో లక్ష రూపాయల నగదు పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భాన అందుకున్న యాభయి వేల రూపాయల నగదు పురస్కారం చెప్పుకోదగ్గవి.

ఎంత ఎదిగినా ఒదిగి వుండే స్వభావి మురళీధరుడి సరళ, సున్నిత కవిత్వం చదవడం ఓ చక్కటి అనుభవం. మీరూ చదవండి.. అనుభూ తించండి.

-రమణ వెలమకన్ని
సెల్: 9866015040



## ఇచ్చోటనే..!

మాట నడకకు
నిలువెత్తు కులం నింపుకొని
భూమంతా పుట్టలు పుట్టలుగా
పడగల నీడల క్రిందా
జాతి లోహితుడి శవంగా పడివున్న
ఒక దుఃఖ లోకం మీద..
ఆకాశం కూడా అంటరానిది అయి
ఊరు అవుతల ఏరుదాటి అడవిలో ఎండిన
ఒంటరి చెట్టుకు ఉరి పోసుకుంటున్నప్పుడు
అక్షరం అగ్ని పునీతమై పురుడు పోసుకొంది-
తండ్రీ జాషువా...!
ఎంత దుఃఖం! ఎంత వేధనా!
ఎంత హైందవ రంపపు చిత్రహింసకు
పుట్టం పెట్టుకొన్నవో..
పడగల మీది అక్షరం... నీ
పాదాల క్రింద మట్టి తేజం చేసుకున్నావు-
ఇచ్చోటనే నీవు ఇచ్చిన
అక్షరం ఆయుధ అక్షయ పాత్ర అయింది-
దళిత తల్లీ యుద్ధపుత్ర వీర తిలకం అయింది-
తండ్రీనిన్ను దలంచి
హైటెక్ హైందవ కుబుసం మీద కూడా
యుద్ధం జరుగుతుంది
నీ వారసత్వ కవి సైన్యంతో...!



*(విశ్వమహా కవి గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా...)*



- జనజ్వాల
సెల్: 9949163770

## శిథిల శిలలు !

ఒక అబద్దానికి ఇంకో అబద్ధం
అతికించడం అలవాటైనప్పుడు
ఎప్పుడో ఒకసారి ఎక్కడో ఒకటి
ఎదలోని గాయాలకు మౌనంగా
విషపూరిత విత్తనంగా నాటుకొని
అమానుషపు మొక్కగా మొలకెత్తి
అంతరంగంలో వృక్షంగా పెరిగితే
చేధించనంత ఎదిగిన నమ్మకానికి
చెప్పనంత ఘోరంగా చెదలుపట్టి
కుప్పకూలి వసుధ వశమైతుంది .
ఆరాధించే శిల్పాలుగా వెలిసిన
అనుబంధాలన్నీ అనవసరమైన
అబద్దాలతో శిథిలమై శిలలైతాయి !
అందమైన జీవన బృందావనంలో
అబద్దాల మనుషులు విషసర్పాలే !

- డా. డి. రాజేశ్
9440460490



## 'నాగలాదేవి' నవల ఆవిష్కరణ



'నాగలాదేవి' నవలను ఆవిష్కరిస్తున్న ఇన్‌కమ్ టాక్స్ చీఫ్ రిటైర్డ్ కమిషనర్ ఎం. నర్సింహప్ప, బిక్కి కృష్ణ, డా॥ నాళేశ్వరం శంకరం తదితరులు.



సీనియర్ పాత్రికేయులు భగీరథను సత్కరిస్తున్న అతిథులు..



"అనువాద శిరోమణి" బిరుదుతో శ్రీమతి విజయలక్ష్మి పండిట్‌ను సత్కరిస్తున్న అతిథులు

భగీరథ రాసిన చారిత్రక నవల నాగలాదేవి అని ఇన్‌కమ్ టాక్స్ చీఫ్ రిటైర్డ్ కమిషనర్ ఎం.నర్సింహప్ప పేర్కొన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని కళాభారతి సంస్థలో భారతీయ సాహిత్య, అనువాద ఫౌండేషన్, రఘు అరికపూడి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ అనువాద దినోత్సవం సందర్భంగా ప్రముఖ కవి, కళారత్న బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నవలను ఆవిష్కరించారు. సీనియర్ పాత్రికేయులు,కవి భగీరథ రాసిన నాగలాదేవి నవల ఈశతాబ్దపు అత్యున్నత నవలగా పేర్కొన్నారు. శ్రీకృష్ణ దేవరాయలు, నాగలాదేవి ప్రేమను నవలగా భగీరథ రాశారన్నారు. అనువాద రంగంలో విశేష కృషి చేసిన ఎలనాగ, రంగనాథ, రామచందర్‌రావు, కొండపాక రవీంద్రచారి, పి. శ్రీనివాస్‌గౌడ్‌కు అనువాద రంగంలో జాతీయ జీవన సాఫల్య పురస్కారం అందజేశారు.



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం-కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు..

## భేరి

సత్యం వద ధర్మం చర
అమ్మ ఒడి నేర్పిన మొదటి పాఠం
ధర్మో రక్షతి రక్షితః
ఆదికావ్యం అందించిన
అమృతసారం
యధా యధా హి ధర్మస్య......
సృజామ్యహం
పంచమ వేదం బోధించిన
సుధామధురం
కుడి ఎడమల తికమకలో
సంధించుట మరచిన
సవ్యసాచి లేడి దేహాన
పులి గుండె నమర్చాడు
వేదాల సంపెంగ నూనెల్ని
పురాణాల జవ్వాది
తైలాల్ని ఆఘ్రాణిస్తూ
విలువల పరకల్ని మేస్తూ
పెరిగిన లేడికూన
విధాత చేసిన గిమ్మిక్కుతో
కొండను ఢీకొట్టింది.
కంచే చేను మేసిందో
కంటి రెప్పే కాటేసిందో
అడవి దాటి రూపుమార్చిన
మృగాల మూకుమ్మడి దాడిలో
అసువులు బాసిన లేడికూన
ఆర్తనాదాలే అస్త్రాలై
దేహ శకలాలే శస్త్రాలై
మ్రోగిస్తోంది యుద్ధభేరి
పాతరేసిన విలువలే
పైశాచిక క్రీడకు మూలమంటూ
పూరిస్తోంది సమరశంఖం

-పద్మశ్రీ చెన్నోజ్వల

## కవిరాజు

రాజు కాని రాజు
ఎదురులేని కెరటం
పాలనార్భాటాలు లేని
నిరాడంబర ప్రతిపక్ష చింతకుడు
హృదయ స్పందనల
శబ్ద సంవిధానం కవి
ఇనుప గోడలు నెలకొని
ప్రతిధ్వనులను మింగే చోట
గడ్డ కట్టిన
మంచు కాగడాలు కరిగిస్తాడు
అక్షరం తోలువని
ఏ అడ్డంకులు ఉంటాయి
రహస్యాల ముడులు విప్పుతాడు
సిరా చుక్క ధార చేసి
సముద్రాలు స్థాపిస్తాడు
గాలిలో మిణుకు మనే నక్షత్రాలను
నేల సూర్యులను అల్లుకొని
రాత్రి ఉయ్యాల తాళ్ల
ఒరిపిడి తెగే పూలవనం కొమ్మమీద
కోయిల పాటయి పాడుతాడు
రక్తాలు పారిన రేణువుల మీద
శాంతి పుష్పాలు
పరిమళింప జేస్తాడు
కలల కాపరి
కవిరాజు
ఇసుక తుఫానులలో
కాలానికి కనురెప్పై
ఒయాసిస్సులు దర్శింప జేస్తాడు.

-బెల్లంకొండ సంపత్ కుమార్
9908519151

## చిగురై నవ్వాలి

బాధ నిర్విరామంగా
సద్దు లేకుండా
కురుస్తూనే ఉంటుంది
ఎదనంతా నిండుకొని
కట్టలు తెంపుకొని
కంటి కాలువల నుండి
ఉప్పు నీటి సరస్సవుతుంది
దానికెప్పుడూ కన్నీరే జత.
అదిప్పుడు
సంఘటనలు చెక్కిన
శిలాఫలకం కాదు
సమ్మెట పోట్లు సలుపుతూ
రగుల్కొల్పిన విప్లవం
అది నిష్క్రమించిన ఆశల
భావచిత్రం కాదు
నిస్తేజం నుండి ఉబికిన
క్రియాశీలక చేతనం.
అది అపభ్రంశపు కూతలు విని
ఆగిపోయిన గీతం కాదు
మౌనంగా జ్వలిస్తూ
పోరాటానికి సిద్ధమైన ఆయుధం
వికృత విధానాలకు ఒదిగి
చేతులు ముడుచుకున్న
ఓటమి కాదు
ఓరిమి నిండగా
గెలుపుగా ప్రవహిస్తున్న సముద్రం
ఇప్పుడది...
ఆత్మ విశ్వాసాన్ని దోసిళ్ళ కెత్తి
అక్షరాలను మేఘాలుగా
గగనానికి ఎగజిమ్ముతోంది
చినుకుగా రాలి
చిగురులా నవ్వడానికి !!

-అరుణ ధూళిపాళ

## కోపం

నా కెందుకో కోపం!
అమెరికాను కనిపెట్టాడని
కొలంబస్ మీద కోపం!
కంప్యూటర్ కనుగొన్నాడని
ఛార్లెస్ బాబ్బేజ్ మీద చిరాకు!
కరెన్సీ దదారిచూపాడని
మార్షల్ అంటే మంట!
విమానమనే లోహవిహంగాన్ని
ఎగురేసారని...
రైట్ సోదరులంటేనే రౌద్రంగా
మారతాను!
అదీ-ఇదీ కాదు!
ఆంగ్లభాషంటేనే అరికాలి మంట
నెత్తికెక్కుతుంది!
అమెరికా లేకుంటే
అమ్మా-నాన్నలు
హాయిగాఉండేవారని,
అంతర్జాలంలో అందరినీ చూసి
అనందించక...
మనవలూ- మనవరాండ్రతో
మజా చేసేవాళ్ళమని...
వస్తుమార్పిడితో కొనసాగే
జీవితాలకు
కరెన్సీ రుచి చూపి-
గాల్లోకి విసిరితే...
పూర్వం జయంతులు-
వర్ధంతులుండేవి సహజంగా...
మదర్స్- ఫాదర్స్-
బర్త్ డేలిప్పుడు కృత్రిమంగా....
గంగా,యమునా,గోదావరి
నీళ్ళకు బదులు
సప్త సముద్రాలు దాటి
మిసిసిపీ తో
దాహం తీర్చుకుంటున్నారు!
కన్నవారిని కంటిపాపతో
చూస్తే తృప్తి!
వెట్టి వెంగళాయిలమై-
వెబ్ కెమెరాల్లో చూసి మురుస్తాం!
డాటర్లనూ-
వారి డాటర్లనూ చూసి మురవాలి!
డాలర్లు- రూపాయల్లోకి మార్చి
మురవడం కాదు!
కోరికలను గుప్పెట్లో పెడితే-
మేధోవలసలు తగ్గవా?
గ్రాహంబెల్లు గారి యంత్రంతో
మాట్లాడి....
కన్నవారిని చూడకనే
గడిచిపోతున్నాయి రోజులు..
నెలలు.సంవత్సరాలు
పిచ్చీ-వెట్టి ఈ కోపమెందుకు?
ఒంట్ సోదరులే చేరుస్తున్నారు...
తన వారి తావుకు...
ఛార్లెస్ లేకుంటే ఛాయా
చిత్రాలుండేవా?
ప్రాణం కొడిగట్టి పోకుండా
ఆపేవి అవేకదా!
మార్షల్ మహాశయుడు లేకుంటే...
మధ్యతరగతి
మలమల మాడేది కదా!
గ్రాండ్ మా...గ్రాండ్ పా అనే
పిలుపుల
తేనె సోనలు అందించే
గ్రాహం బెల్లు గాడే కదా!
తిరిగాలోచిస్తే...
తిరోగమనమెందుకు?
సాంకేతిక లోపిస్తే..
సమాజ మనుగడ ఎలా?
అందుకే...అందరికీ
నామనో వాకములు...

-రంగరాజుపద్మజ

## అమ్మ

మరో ఉదయం అమ్మ
మరో శక్తి అమ్మ
మరో పుట్టుకనిచ్చే అమ్మ
మరో బ్రహ్మ అమ్మ.
మరో నేస్తం అమ్మ
మరో విజ్ఞానం అమ్మ
మరో చలనశీలి అమ్మ
మరో నినాదం అమ్మ.
మరో పాఠం అమ్మ
మరో నైపుణ్యం అమ్మ
మరో ధీశాలి అమ్మ
మరో ప్రపంచం అమ్మ.
మరో ముద్ద అమ్మ
మరో లెక్క అమ్మ
మరో ఒడ్డు అమ్మ
మరో మరబొమ్మ అమ్మ.

-కూర భానుజ

## అడగాలని ఉంది!

మందువేసవా మరికాదు
వానాకాలమే
వాటేయకుండా ఉండదు
ఈ ఉక్కపోతప్రేయసి
ఋతువుల అప్పగింతల్లో పెళ్ళిపిల్లలా
వేళకు వేసవి వెళ్ళి పోయింది
భూమి తనివితీరా స్వప్నించింది
తాపం తోకముడుస్తుందని
నీలి మబ్బులు
నీటి ముత్యాలను కురిపిస్తాయని
జడివానలతో చల్లబడుతానని
పంటలతో పచ్చబడుతానని
ఆకాశమంత ఊహించిన ఈ నేలకు
నీళ్లగిలాసను బోర్లించినా
రాలిపడని నీటిబిందువులా
ఒక భంగపాటు మాత్రం మిగిలింది
ఆషాఢం ఆగమైంది
శ్రావణం వైశాఖ మేఘమైంది
మందువేసవా మరికాదు
వానాకాలమే
వాటేయకుండా ఉండదు
ఈ ఉక్కపోతప్రేయసి
లంకంత ఇళ్ళలో
పంకాలెన్ని తిరుగుతూ ఉన్నా
కరెంటు మీటరు అంకెలెన్ని
ఆగకుండా లెక్కబెడ్తున్నా
జాలి లేదు జాడలేదు
శీతలసమీరం దేహాన్ని తాక'రాదు'
చల్లగాలి గడుసుదైందా
అంటరానితనం ఒంటబట్టుకుందా
భారతీయుల్లా
వీసా తీసుకుని
విదేశాలకు వెళ్ళిపోయిందా
కరెంటు పోతే
చెట్టు చేమలు పాలిపగలా
జడమౌనంలో మునిగిపోతే
గది తీహార్ జైలు
అండాల్ గదవుతుంది
శరీరం
జీవనదులకు జన్మస్థానమవుతుంది
ఉప్పుఉబుకి ఉనికిచెబుతుంది
మనసుకు ఏమి తోచని ఆ సమయం
వీరునిలా చికాకు బయలుదేరుతుంది
మందువేసవా మరికాదు వానకాలమే
వాటేయకుండా ఉండదు
ఈ ఉక్కపోత ప్రేయసి
సూరీడు ఏ భూలోకసుందరి కోసం
భూతద్దంబెట్టి వెతుకుతున్నాడో
దేనికోసమో
తారలు తగువులాడుతున్నాయో
ఆకాశం సెగలు కురిపిస్తుంది
అవని అగ్గి కక్కుతుంది
కడలి కనికరం లేకుండా
ఉడికిపోతుంది
ఏమి వైపరీత్యం ఈ సాలు
ఎవరి వల్లనో ఈ మోసాలు
మందువేసవా మరికాదు వానాకాలమే
వాటేయకుండా ఉండదు
ఈ ఉక్కపోతప్రేయసి
తుఫాన్ భారీవర్షాలు
వరదలైముంచెత్తిన
కన్నీటి గాథలు ఒకవైపు
ఎండాకాలంలామంటల
మనుషులబాధలు మరొకవైపు
ఏమిటో ఏలనో ఈ వానాకాలం
ఆకుపచ్చని పచ్చదనాల మధ్య
ఈ తాళలేనివెచ్చదనాన్ని
తురుముతుంది
మందువేసవా మరికాదు వానకాలమే
వాటేయకుండా ఉండదు
ఈ ఉక్కపోతప్రేయసి
ఈ మండుటెండల మధ్యన
ఈ పగలు రాత్రుల మధ్యన
వాన (కన))పడితేనే
వానాకాలమని ఊహకురాదు
వేడి తేమమీద ప్రేమతో వేసంగిలా
ఎందుకో ఏమోఈ వర్షాకాలం
ఉరుముతుంది
గ్రామాల్లో,నగరాల్లో
ఉష్ణగాలుల్లా జులుం విధిస్తుంది
మనుగడ పాటలో
వాతావరణమే పల్లవీచరణం
మనిషిదే నిత్య రణం
మందువేసవా మరికాదు వానాకాలమే
వాటేయకుండా ఉండదు
ఈ ఉక్కపోత ప్రేయసి
వానకాలం ఎందుకనో
నిరాశల్ని నిట్టూరుస్తూంది
మనిషివల్లో మానువల్లో
మరే ఉపద్రవం వల్లో
వానకాలనికి
ఏ జ్వరమొచ్చిందో,
ఏ జలుబు చేసిందో
ఏ బాధైందో ఏ ఎడబాటైందో
వానాకాలాన్ని
ఒకసారి అడగాలని ఉంది నాకు.

-రమేశ్ నల్లగొండ

## మరల రా బాపూ

మోకాలు దాటని గోచి
అంగి లేని దేహం
బోసి నవ్వుల తేజం
శాంత గంభీర రూపం
చేతిలో కర్ర జ్ఞాన గీత
అతడే జాతిపిత
జాతిని నడిపిన నేత.
ఉప్పు సత్యాగ్రహం
ఉప్పెనగా
సత్యాహింసలు
ఆయుధాలుగా
విదేశీవస్తుబహిష్కరణ
సహాయ నిరాకరణ
పూరించిన సమర
శంఖారావం
బానిస సంకెళ్లు తెంపి
తెల్ల దొరల తరిమిన
స్వాతంత్రఉద్యమనేత
నేతలందరినీ
ఒక్కతాటిపై నడిపిన
స్ఫూర్తి ప్రదాత
విశ్వ మానవ ప్రేమ
శాంతి స్థాపన తపన
అయినా ...
తుపాకి తూటాకిబలి
అన్యాయానికి గురి
చెంప దెబ్బ సిద్ధాంతం
తిరగబడి నవ్వుతోంది
విలువల వలువలు
విప్పేసిన నేటి నేతలు
పగ ప్రతీకారం ద్వేషం
మాస్ మసాలాసినిమాలు
పెడదారిలో భవితలు
జీవన విలువలు
ఎక్కడో అక్కడఓ తులసి మొక్క
గంజాయి వనంలో..
బతికిబట్టకట్టేస్థితిలేదు
పట్టదు ఎవరికి గాంధీమతము..
నాటి భావాలు పెను
నిద్దురలో నేడు..
తట్టి లేపేదెవరు
తలచేదేవరు
నీవే...నీవే మరల రా బాపూ

-గద్దం సులోచన

ఈ నెల 6న వార్షిక సాహిత్య సభల సందర్భంగా...

# తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య కృషి

## జాతి పురోగమనానికి, ఔన్నత్యానికి మార్గదర్శనం చేసేది సాహిత్యం- దాశరథి

నిజాం పాలన నుంచి హైదరాబాద్ విముక్తమైన తర్వాత **తేది 6.9.2051**లో దాశరథి, కాళోజీ, సినారె, బిరుదురాజు వంటి సాహితీమూర్తుల ఆధ్వర్యంలో ఆనాటి తెలంగాణ రచయితల సంఘం ఏర్పడింది. తెలంగాణ పేరుతో ఏర్పడ్డ మొదటి సాహిత్య సంస్థ అది. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక ఉన్నతికి అది ఎంతగానో కృషి చేసింది. విశాలాంధ్ర దురాక్రమణ భ్రమల వెనుక ఆనాటి తెరసం మాయం చేయబడింది. ఆంధ్రప్రదేశ్‌గా కోస్తాంధ్ర భాష, సాహిత్య ఆధిపత్యం రాజ్యమేలింది.

దశాబ్దాల పోరాట ఫలంగా తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో సాహిత్య, సాంస్కృతిక అస్తిత్వాన్ని, పరిరక్షించుకోవడానికి ఆవిర్భవించింది ఇప్పటి తెలంగాణ రచయితల సంగం. **తేది 21.5.2014**న సిద్దిపేటలో రాష్ట్ర స్థాయి సాహిత్య సంస్థగా తెరసం రూపుదిద్దుకున్నది. అప్పటి నుంచి నిర్దేశించుకున్న ఆశయాల మేరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. జిల్లాలకూ విస్తరించింది. ప్రస్తుతం తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర కమిటీతో పాటు 11 జిల్లాల కమిటీలు, దాదాపుగా 400 మంది సాహిత్యకారులతో పనిచేస్తోంది.

జిల్లాశాఖల కార్యక్రమాలు కాకుండా తెరసం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు:

- **తెరసం ఆవిర్భావ సభ నవంబరు 30, 2014**న హైదరాబాదులో జరిగింది. ప్రారంభ సభలో ముఖ్య అతిథి, ప్రసిద్ధ ఒగ్గు కళాకారుడు చుక్కా సత్తయ్య చేతుల మీదుగాతెరసం లోగో ఆవిష్కరణ జరిగింది. అతిథులుగా హాజరైన కె. రామచంద్రమూర్తి, అల్లం నారాయణ, కట్టా శేఖర్‌రెడ్డి, బైస దేవదాసు, జింబో, దేవీప్రసాద్, దేవపతి శ్రీనివాస్, విరాహత్ అలీ సంస్థకు మార్గదర్శనం చేశారు. ఆ సభను తెలంగాణ సాహిత్యం- రచయితల కర్తవ్యాలు అనే అంశంపై నిర్వహించడం జరిగింది.. సదస్సులో శ్రీరంగాచా ర్యులు, సంగిశెట్టి శ్రీనివాస్, గంద్ర లక్ష్మణరావు, ఏనుగు నరసింహారెడ్డిలు ప్రసంగాలు చేశారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది.
- **8.9.2015**న కాళోజీ జయంతి నేపథ్యంలో తెలంగాణ భాషా దినోత్సవం రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరిగింది. ఆచార్య బన్న అయిలయ్య, పరాంకుశం వేణుగోపాల స్వామి, దేశపతి శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.
- కామారెడ్డిలో 'కవిత్వ కళా శిబిరం' పేరుతో **28.11.2015**న కవిత్వ కార్యశాల జరిగింది. తెలుగు కవిత్వంలో శిల్పం, వస్తు వైవిధ్యం వచన కవిత్వంలో విభిన్న రూపాలు, పద్య కవిత్వం అనే అంశాలపై డా॥ నందిని సిధారెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, ఎం.నారాయణశర్మ, డా॥ అయాచితం నటేశ్వర శర్మ పాఠాలు బోధించారు. కవితా సృజనలో వారు నేర్పిన మెళకువలతో రాసిన కవితలతో కవిసమ్మేళనం జరిగింది. ఆనాటి కవిత్వ పాఠాలు, కవితలతో తెరసం కొత్త తొవ్వ పేరుతో సంకలనం ప్రచురించింది.




- **జులై 2, 2016**న తెలంగాణ సారస్వత పరిషత్తులో డా॥వి. శంకర్ రాసిన 'నిజామాబాదు జిల్లా కవిత్వం' పుస్తకావిష్కరణ ఆచార్య సి. నారాయణరెడ్డి చేతుల మీదుగా జరిగింది. డా॥ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య టి. కిషన్‌రావు, డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ ఎ. శ్రీధర్, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- **జూన్ 11 2017**న నిజామాబాదులో 'తెలంగాణ సాహిత్యం- కర్తవ్యాలు' అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా అప్పటి తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి పాల్గొన్నారు. తెలుగు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, కె. శ్రీనివాస్ వక్తలుగా హాజరైనారు. డా॥ నాళేశ్వరం శంకరం అధ్యక్షులుగా, ఘనపురం దేవేందర్, డా॥వి. శంకర్ కార్యక్రమం నడిపించారు.
- **డిసెంబర్ 3, 2017**న తెరసం రెండో రాష్ట్ర మహాసభను తెలంగాణా సాహిత్య వికాసం- వివిధ ప్రక్రియలు పేరుతో తెలంగాణ సారస్వత పరిషత్తులో ఒకరోజు సభ జరిగింది. నాటి సదస్సులు, అందులోని అంశాలు అప్పటి తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలకు దిశానిర్దేశం చేసేలా నడిచాయి. పొద్దంతా జరిగిన ఈ సదస్సులో కె.రామచంద్రమూర్తి, డా॥నందిని సిధారెడ్డి, అల్లంనా రాయణ, ఆచార్య ఎస్వీ సత్యనారా యణ, అయాచితం శ్రీధర్, డా॥గంద్ర లక్ష్మణరావు, బైస దేవదాసు, మామిడి హరికృష్ణ, డా॥ దేవకీదేవి, డా॥రఘు తదితరులు పాల్గొని వేర్వేరు ప్రక్రియలపై ప్రసంగించారు. సాయంత్రం రెండు వేదికల మీద జరిగిన కవి సమ్మేళనాల్లో వారాల ఆనంద్, వజ్జల శివకుమార్ వంటి సీనియర్ కవులతో పాటు దాదాపు 100 మంది కవులు పాల్గొన్నారు.
- సిరిసిల్లకు చెందిన ప్రముఖ రచయిత, కవి చైతన్య ప్రకాశ్ సంస్మరణ సభ హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరిగింది. ఆయన కవిత్వం గురించి ఆచార్య కాశీం, కథల గురించి కె.పి. అశోక్ కుమార్, చైతన్య ప్రకాశ్ సంకలనం చేసిన సామెతల మీద డా॥వి. శంకర్ మాట్లాడారు. ముఖ్య అతిథిగా డా॥నందిని సిధారెడ్డి పాల్గొనగా, డా॥ నాళేశ్వరం శంకరం సభాధ్యక్షులు, మామిడి హరికృష్ణ, డా॥ ఏనుగు నరసింహారెడ్డి ఆత్మీయ అతిథులు, వజ్జల శివకుమార్, డా॥ తైదల అంజయ్య, డా॥ పొన్నాల బాలయ్య, ఘనపురం దేవేందర్, కొత్త అనిల్‌కుమార్, దూడం సంపత్‌కుమార్‌లు ఎంపికచేసిన చైతన్య ప్రకాశ్ కవితలు వినిపించారు.

చైతన్య ప్రకాశ్ అనారోగ్యంగా ఉన్నప్పుడు చికిత్స కోసం తెరసం తరఫున ఆర్థిక సహాయం కూడా అందించబడింది.

**జూన్ 30, 2019**న మూడో రాష్ట్ర మహాసభ తెలంగాణా ఉద్యమాలు- సాహిత్య సంస్థలు- సాహిత్యం పేరుతో తెలంగాణ సారస్వత పరిషత్తులో నిర్వహించింది.

- **5 అక్టోబర్ 2020**న హైదరాబాదులోని బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో డా॥ నందిని సిధారెడ్డి 'అనిమేష' ఆవిష్కరించబడింది.
- **21.5.2021**న ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు కె.కె. రంగనాథాచార్యులు సంస్మరణ సభ జూమ్ అంతర్జాల వేదికగా జరిగింది. నిఖిలేశ్వర్, డా- వెల్చేరు నారాయణ రావు, డా॥డి. చంద్రశేఖర్ రెడ్డి, డా॥కె. శ్రీనివాస్, డా॥ నందిని సిధారెడ్డి వక్తలుగా పాల్గొని కె.కె.ఆర్ సాహిత్య కృషిని వివరించారు.
- **7.8.2021**న జూమ్ వేదికగా డా॥సి. నారాయణ రెడ్డి సాహిత్య సదస్సు జరిపింది. ఆచార్య ఎండ్లూరి సుధాకర్, గంద్ర లక్ష్మణరావు వక్తలుగా పాల్గొన్నారు.

తెలుగు భాష-ఆధిపత్యాలు అనే అంశంపై హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో **24.12.2022**న ఒక సదస్సు జరిగింది. తెలుగు భాష- సాహిత్య ప్రభావం ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, తెలుగు -వివిధ భాషలు- ఆధిపత్యాలు డా॥ నలిమెల భాస్కర్, తెలుగు భాష- ప్రసార మాధ్యమాలు- ప్రభావాలు డా॥.కె. శ్రీనివాస్, భాషాధిపత్యాలు-ఉద్యమాలు-తెలుగు డా॥ నందిని సిధారెడ్డి ప్రసంగించారు. ఆనాటి ప్రసంగాలు యూట్యూబ్‌లో కూడా అందుబాటులో ఉన్నాయి.

- **18.4.2023**న తెరసం వ్యవస్థాపక సభ్యులు దేశపతి శ్రీనివాస్ ఎమ్మెల్సీగా నియమితులైన సందర్భంగా ఆయనకు అభినందన సభ రవీంద్రభారతి సమావేశ మందిరంలో ఏర్పాటు చేయబడింది. ప్రసిద్ధ కవులు శివారెడ్డి, డా॥ నంధిని సిధారెడ్డి, నలిమెల భాస్కర్, వారాల ఆనంద్, కందుకూరి శ్రీరాములు, గంద్ర లక్ష్మణరావుతో పాటు దేవీప్రసాదరావు, విరాహత్ అలీ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.
- **12.7.2024**న డా॥ తూర్పు మల్లారెడ్డి వ్యాస సంపుటి అన్వేషణ ఆవిష్కరణ రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరిగింది. ఆవిష్కర్తగా డా॥ నందిని సిధారెడ్డి, సభాధ్యక్షులు డా॥ నాళేశ్వరం శంకరం, అతిథులుగా డా॥ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ హాజరయ్యారు. డా॥వి. శంకర్ పుస్తక పరిచయం చేశారు. మొదటి సభలో వారాల ఆనంద్‌గారి మానేరు గలగల నుండి మొన్నటి జులై 12న డా॥ తూర్పు మల్లారెడ్డి అన్వేషణ వరకు 4కి పైగా పుస్తకాలు ఆవిష్కరించబడ్డాయి. అందులో సగం తెరసం పక్షాన ప్రచురించబడ్డాయి. హుస్నాబాదు, నిజామాబాదులో ప్రాంతీయ సాహిత్య సదస్సులు జరిపింది. కామారెడ్డి, సిద్దిపేటలలో కార్యశాలలు ఏర్పాటు చేసింది. కరీంనగర్ శాఖ ప్రారంభించిన (కవిత్వంతో కలుద్దాం)ను కరీంనగర్‌తో పాటు వరంగల్ శాఖలు కొనసాగిస్తున్నాయి. సిద్దిపేట, మెదక్, జనగాం శాఖలు కూడా సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. తెలంగాణ సమాజం అస్తిత్వం, చైతన్యం కాపాడుకోవడానికి అవసరమైన ప్రతీ సందర్భంలో తెలంగాణ రచయితల సంఘం తన గొంతుక వినిపించింది. ఆర్టీసీ సమ్మె, డా॥ కాశీం అరెస్టు వంటి సందర్భాల్లో నిర్మొహమాటంగా తన వైఖరి పత్రికాముఖంగా వెల్లడించింది. తెలంగాణా రచయితల సంఘం స్వతంత్రంగా పనిచేస్తుంది. ప్రజల పక్షం వహిస్తుంది. ప్రజల ఉత్సాహాలను, ఉద్వేగాలను అక్షరబద్ధం చేస్తుంది.










## ఆయా ప్రాంతాల్లో జరిగిన సభా కార్యక్రమాలు

### సిద్దిపేటలో ...

**తేది-05-ఫిబ్రవరి 2017**న ప్రతిభా డిగ్రీ కాలేజీ- సిద్దిపేటలో మొదటి సమావేశం ఏర్పరచుకొని సంఘం- ఆవిర్భావం మరియు విధి విధానాల గురించి సభ్యుల అభిప్రాయాల సేకరణ జరిగింది.

**తేది-08-ఫిబ్రవరి 2017** తోట అశోక్‌గారి అధ్యక్షతన రెండవ సమావేశం- వేదిక ప్రెస్‌క్లబ్, సిద్దిపేటలో ముఖ్య అతిథిగా డా॥ నందిని సిధారెడ్డి పాల్గొన్నారు.

**అంశం: "భవిష్యత్తు తెలంగాణ- రచయితల కర్తవ్యం"**పై ప్రసంగించారు.

తదుపరి తెలంగాణ రచయితల సంఘం- సిద్దిపేట జిల్లా, 45-50 మంది కవి గాయకులతో విజయవంతంగా నిర్వహణ.

**తేది-22 మే 2017** అభినందన సభ నిర్వహణ.

గౌరవనీయులు డా॥ నందిని సిధారెడ్డిగారు తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు ఎన్నికైనందున అభినందన సభ నిర్వహించారు.

**తేది 04 -06 2017** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టరుగారి ఆమోదంతో నిర్వహించిన కవి సమ్మేళనంలో తెరసం, సిద్దిపేట విశేష కృషి చేసి విజయవంతం చేసింది.

**తేది-17-06-2017** కీ॥శే- సింగిరెడ్డి నారాయణరెడ్డిగారి సంస్మరణసభ ప్రెస్‌క్లబ్‌లో వక్తగా ప్రొ॥ ఎస్. రఘుగారు ప్రసంగం.

ఈ సమావేశంలో కవులు- రచయితలు- సాహిత్యాభిమానులు సుమారు 70 వరకు హాజరై విజయవంతం చేసారు.

**తేది-22-7-2017** దాశరథి కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా **"కవి సమ్మేళనం"** వేదిక ప్రెస్‌క్లబ్- సిద్దిపేట.

**తేది-09-09-2017 "కాళోజీ జయంతి"** సందర్భంగా "కవి సమ్మేళనం" వేదిక ఎన్‌జిఓ భవన్- సిద్దిపేట

**తేది-19-09-2017** తెరసం- సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి "గంభీరావుపేట యాదగిరి"గారి **"భాగ్య బాల శతకము"** ఆవిష్కరణ సభ వేదిక ప్రెస్‌క్లబ్-సిద్దిపేట, ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డిగారు సుమారు 80 మంది కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు హాజరయి సభను విజయవంతం చేశారు.

**తేది 19-11-2017** సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల కవి సమ్మేళనంలో క్రియాశీలక పాత్ర పోషించి విజయవంతం చేసిన తెరసం, సిద్దిపేట జిల్లా.

**తేది 01-12-2017**న సిద్దిపేట శివానుభవ మంటపంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక సమావేశంలో'లోగో' ఆవిష్కరణ మంత్రివర్యుల చేతుల మీదుగా (తన్నీరు హరీష్‌రావుగారు) జరిగిన కార్యక్రమం జరిగింది.

**తేది 22-3-18** రోజున ప్రెస్‌క్లబ్- సిద్దిపేటలో **'సిద్దిపేట, సాహితీ సౌరభం'** పేరున పుస్తకాల పరిచయ సభ విజయవంతంగా నిర్వహించటం జరిగింది.

ఈ సభలో డా॥ అయోధ్యారెడ్డిగారి- **ఆహార యాత్ర,** కందుకూరి శ్రీరాములుగారి- **అలుకు పిడుచ** పప్పుల రాజిరెడ్డిగారి- **గంగాళం**-బైతి దుర్గయ్యగారి- **అలుకు మొలకలు** పుస్తకములను వరుసగా డా॥ నాళేశ్వరం శంకరంగారు డా॥ వి. శంకర్‌గారు, డా॥ చిలుముల శ్రీనివాస్‌గా, డా॥సిద్దెంకి యాదగిరిగారు పరిచయం చేయగా సభాధ్యక్షులుగా- పొన్నాల బాలయ్యగారు ముఖ్య అతిథిగా డా॥నందిని సిధారెడ్డిగారు, ప్రత్యేక ఆహ్వానితులుగా కొమురవెల్లి అంజయ్యగారు, కె.రంగాచారిగారు, యస్. యాదవరెడ్డిగారు పాల్గొన్నారు. నమన్వయకర్తలుగా- గంభీరావుపేట యాదగి రిగారు, తోట అశోక్‌గారు, తైదల అంజయ్యగారు, నార్లాపురం రాములుగారు వ్యవహరించారు.

**తేది-08-05-2018** రోజున సిద్దిపేటలోని ఐఎంఏ హాలులో **"ఒక్కరోజు కవిత్వ శిక్షణాతరగతులు'** ఘనంగా నిర్వహించటం జరిగింది.

కార్యక్రమం 4 సెషన్స్ విభజించటం జరిగింది.

**మొదటి సెషన్**కు డా॥ బన్న ఐలయ్యగారు **"కవిత్వం వస్తువు"**పై డా॥ పెన్నా శివరామకృష్ణ గారు **"కవిత్వం-శిల్పం"** విషయాలపై ప్రసంగించారు.

**రెండవ సెషన్-** డా॥నంకిరెడ్డి నారాయణరెడ్డి గారు **'కవిత్వం దృక్పథం"**పై డా॥ కోయి కోటేశ్వర్‌రావుగారు **'కవిత్వం-భాష-అభివ్యక్తి'** అనే అంశంపై తరగతులు నిర్వహించారు.

అంతకుముందు ఉదయం ప్రారంభ సమావేశంలో డా॥నందిని సిదారెడ్డిగారు ప్రసంగించారు.

సాయంత్రం ముగింపు సమావేశంలో డా॥ నందిని సిధారెడ్డిగారితో పాటు డా॥వి. శంకర్‌గారు, జి. తిరుపతిరెడ్డిగారు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**తేది. 12-6-2018** రోజున ప్రెస్‌క్లబ్ సిద్దిపేట లో డా॥సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె)గారి ప్రథమ వర్ధంతి సభను నిర్వహించి నివాళులు అర్పించటం జరిగింది.

ఈ సభలో పొన్నాల బాలయ్యగారు కె. రంగాచారిగారు ఎన్. భగవాన్‌రెడ్డిగారు వేముగంటి రఘునందన్‌గారు గంబీరావుపేట యాదగిరిగారితో పాటు సిద్దిపేట కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

**తేది 31-07-2019** రోజున గంభీరా వుపేట యాదగిరిగారు రచించిన 'గల్మ' కవితా సంపుటి పరిచయ సభ ప్రెస్‌క్లబ్ సిద్దిపేటలో ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిథిగా డా॥నందిని సిధారెడ్డిగారు, ఆత్మీయ అతిథులుగా సిఎం ఓఎస్‌డి దేశపతి శ్రీనివాస్‌గారు డా॥నాళేశ్వరం శంకర్ గారు, కొమురవెల్లి శంకర్‌గారు, కె.రంగాచారిగారు పాల్గొనగా సభాధ్యక్షులుగా పొన్నాల బాలయ్యగారు వ్యవహరించారు.

**తేది:14-08-2019** తేది నుండి **'కవిత్వంతో కలుద్దాం"** పేరున **'కవి సమ్మేళనం-విశ్లేషణ'** కా ర్యక్రమాన్ని ప్రతి నెలలో రెండవ బుధవారములు ప్రెస్‌క్లబ్, సిద్దిపేట వేదికగా విజయవంతంగా నిర్వహించటం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమం కరోనా లాక్‌డౌన్ వరకు నిర్వహించటం జరిగింది.























